క్లుప్తంగా

నేటి నుంచి దోసాలమ్మ వారి సంక్రాంతి ఉత్సవాలు


దోసాలమ్మ అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలు సోమవారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ భోగి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం భజన, 14వ తేదీ సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు, సాయంత్రం కచేరి, 15వ తేదీ కనుమ రోజున ఉదయం అమ్మవారి పంచలోహ విగ్రహం ఉయ్యాల సేవ, సాయంత్రం ఐదు గంటల నుంచి అమ్మవారి పంచలోహ విగ్రహానికి భారీ ఊరేగింపు జరుగుతుందని వివరించారు. 16వ తేదీ ముక్కనుమ రోజున భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకోవచ్చన్నారు. 26వ తేదీన భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


చిన్నారులకు కరాటే కిట్లను అందజేస్తున్న సూర్యకృష్ణ దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని హుకుంపేట సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు తెల్లమేకల సూర్యకృష్ణ అన్నారు. ఆదివారం పిడింగొయ్యి గ్రామంలో కరాటే కోచ్ పంచికట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు రూ.7 వేల విలువ చేసే నాన్‌సాక్స్, కరాటే కిట్లను తెల్లమేకల సూర్యకృష్ణ, మణి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచికట్ల ఉమామహేశ్వరరావు పి.లక్ష్మీలావణ్య, జి.నాగదుర్గతేజ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సంక్రాంతి నంది పురస్కారాల ప్రదానం


నృత్యాభినయం చేస్తున్న కళాకారులు

ప్రకాశం నగర్: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు, నంది పురస్కారాల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గత 11 ఏళ్లుగా కళా రంగంలో విశేష కృషి చేస్తున్న 300 మందికి పైగా ప్రతిభ కలిగిన కళాకారులను అకాడమీ అధ్యక్షురాలు లయన్ లాలితారావు, ఇతర సభ్యులు నంది పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు భాగవతుల మోహన్‌రావు, బి.సత్యనారాయణమూర్తి, తోట సుబ్బారావు, సప్పదుర్గప్రసాద్, పసుమర్తి శ్రీనివాసశర్మ, అడ్డాల నాగేశ్వరరావు, అనిత అతిథులుగా హాజరయ్యారు. పలువురు కళాకారులు చేసిన నృత్య అభినయం ప్రేక్షకులను అలరించింది. రాయప్రోలు రాధ, పద్మజ, పద్మలత, కె.ప్రమీల, లక్ష్మి తదితరులు నంది పురస్కారాలను అందుకున్న వారిలో ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

సీతానగరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు హెచ్చరించారు. ఆదివారం సీతానగరం పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. మండలంలో కోడిపందాల బరులపై ఆరా తీసి, పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కోడిపందాలు, పేకాట, జూదాలు, గుండాట, అశ్లీల నృత్యాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంక్రాంతి పండగ మూడు రోజులూ మంచి సంప్రదాయ పద్ధతిలో, శాంతియుత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ఉచిత రీచార్జ్‌ల పేరుతో వస్తున్న సందేశాల లింకులను తెరవవద్దని సూచించారు. వాటి వలన బ్యాంక్ ఖాతాలో నగదు నష్టపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పండగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఎస్సై డి.రామ్‌కుమార్ ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

రాజానగరం: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, వాటిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ ఎస్పీ వీరయ్యగౌడ్ హెచ్చరించారు. కోడి పందాలు, పేకాట, గుండాట, వంటి వాటిని ఆడటం, అశ్లీల నృత్య ప్రదర్శనలు ఇవ్వడం నేరమన్నారు. అలాగే పండగ సందర్భంగా గ్రామాంతరాలు వెళ్లే వారు ముందుగా తమకు సమాచారమిస్తే, నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు.

సంక్రాంతికి సిద్ధం

- భోగభాగ్యాలను ఇంటికి తెచ్చే భోగి
- నగరంలో నేటి నుంచి వేడుకలు
- అనేక చోట్ల భోగి మంటలకు ఏర్పాట్లు


కంబాల చెరువు సెంటర్ వద్ద భోగి మంట వేసిన స్థానికులు

రాజమహేంద్రవరం సిటీ: ఆధ్యాత్మిక రాజధాని రాజమహేంద్రవరం పెద్ద పండగకు సిద్ధమైంది. సంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి పర్వదినాన్ని సందడిగా జరుపుకొనేందుకు నగరవాసులు ఉత్సాహపడుతున్నారు. భోగభాగ్యాలను తెచ్చే సంక్రాంతి ముందు రోజు వచ్చే భోగి పండగను నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకున్నారు. నగరంలోని ప్రతి సెంటర్‌లోనూ భోగి మంటను వేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం తెల్లవారుజామున సంప్రదాయబద్ధంగా నలుగుపిండితో తలస్నానమాచరించి, భోగిమంటలో పిడకలను వేసి నమస్కరిస్తారు. సంక్రాంతికి ఒక రోజు ముందు భోగి పండగతో సంబరాలు మొదలవుతాయి. భోగి అంటే భోగభాగ్యాలను అనుభవించే రోజు అని అర్థం. దక్షిణాయణంలో సూర్యుడు రోజురోజుకూ భూమికి దక్షిణం వైపుగా కొద్దికొద్దిగా దూరం కావడం వలన చలి బాగా పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు వెచ్చదనం కోసం చలి మంటలు వేసుకుంటారు. సంక్రాంతి రోజు వివిధ పిండి వంటలు వండి, ఇంటికి బంధువులను పిలిచి అతిథ్యమిస్తారు. ముఖ్యంగా సంక్రాంతికి అల్లుళ్లు అత్తారింటికి రావడం ఆచారంగా ఉంది. కొత్త పండక్కి అల్లుళ్లని పిలిచి, సంప్రదాయంగా నూతన వస్త్రాలు, లాంఛనాలతో సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. ఇంటి నిండా బంధువులు, పిల్లాపాపలతో సందడి నెలకొంటుంది.

ఆరోగ్యవరంగా..

ధనుర్మాసం ప్రారంభంతో మహిళలు ఇంటి ముందు ఆవు పేడతో కల్లాపి చల్లుతారు. సంప్రదాయ ముగ్గులు పెట్టి, వాటి మధ్యన ఆవు పేడతో అందమైన గొబ్బెమ్మలను పెట్టి పూజలు నిర్వహిస్తారు. అనంతరం వాటిని పిడకలుగా చేసి, భోగి పండగ రోజు మంటల్లో వేస్తారు. వీటిని కాల్చడం వల్ల గాలి శుద్ధి అయి, సూక్ష్మక్రిములు నశిస్తాయని, మనుషులకు శ్వాస కోశ సంబంధిత రోగాల నుంచి ఉపశమనం లభిస్తుందని ప్రతీతి.

ప్రత్యేకంగా తయారీ

భోగి పండగ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో మంటల్లో వేసేందుకు పిడకలను ప్రత్యేకంగా తయారు చేస్తుంటారు. భోగి మంటల్లో ఆవు నెయ్యి, ఆవు పిడకలను వేయడం వల్ల శక్తిమంతమైన గాలి విడుదలవుతుంది. అందుకే భోగి మంటలను ప్రతి పల్లెటూళ్లో విధిగా వేస్తారు.

42 డివిజన్లలో..

నగరంలోని 42 డివిజన్లలో భోగి పండగ సందర్భంగా వేలాదిగా భోగి మంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ప్రధాన కూడళ్లతో పాటు, పలు వీధుల్లో భోగి మంటలు వేసేందుకు ఇప్పటికే కలపను సిద్ధం చేశారు. వీధుల్లో చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారంతా కలసికట్టుగా సంక్రాంతి వేడుకలు జరుపుకొనేందుకు భోగి పండగతో సిద్ధమవుతున్నారు.

పెరిగిన గిరాకీ

మునుపెన్నడూ లేని విధంగా నగరంలో భోగి పిడకల దండల అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత ఏడాది అక్కడక్కడా మాత్రమే కనిపించిన భోగి పిడకల దండలు.. ప్రస్తుత సంక్రాంతి పండగతో పోలిస్తే ఎక్కువ. ఎక్కడ చూసినా గుట్టలుగా పోసి వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. 60 పిడకల దండ రూ.40 నుంచి పిడకల సైజును బట్టి రూ.100, రూ.200కు విక్రయిస్తున్నారు. భోగి పిడకల దండలను ఆన్‌లైన్‌లో అమ్మకాలు సాగించడంతో పాటు, నగరంలో పెద్ద మాల్స్‌లో సైతం విక్రయిస్తున్నారు.


సైకిల్‌పై విక్రయిస్తున్న భోగి పిడకల దండలు


సంక్రాంతి పండగ కోసం అమ్ముతున్న పూజా సామగ్రి, భోగి పిడకలు దండలు

పూజా సామగ్రితో పాటు..

గతంలో ఎక్కడో ఓచోట కనిపించే భోగి పిడకలు అమ్మకాలు ప్రస్తుతం పండగ పూజా సామగ్రితో పాటు స్థానం దక్కించుకుంది. పూజకు అవసరమైన రేగుపండ్లు(భోగి పండ్లు), అరటిపండ్లు, చెరకు ముక్కలతో పాటు అమ్మకం సాగించేందుకు చిరు వ్యాపారులు సిద్ధం చేశారు. గతంలో కొద్దిమంది మాత్రమే అమ్మకం సాగించే భోగి పిడకలు నగరంలో అన్ని ప్రాంతాల్లో చిరు వ్యాపారులు విక్రయిస్తున్నారు.

నేటి తరానికి ఔన్నత్యం తెలపాలి

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని భోగి పండగ, బంధువులు, అల్లుళ్ల రాకతో ఇల్లంతా ఆనందోత్సాహాలతో ఉంటుంది. సంక్రాంతి పేరు చెబితేనే సంబరాలు గుర్తొస్తాయి. ప్రతిఒక్కరూ పండగ పేరు చెప్పి భోగి నుంచి సంక్రాంతి, కనుమ, ముక్కనుమ వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆనందోత్సాహాలతో గడుపుతారు. చిన్నప్పటి నుంచి పండగ వస్తుందంటే ఆనందమే వేరు. నేటి తరానికి సంక్రాంతి పండగ ఔన్నత్యాన్ని తెలియజేయాలి.

– కర్రి లక్ష్మీనరసింహారెడ్డి, నారాయణపురం, రాజమహేంద్రవరం

బంధువుల రాకతో ఆనందం

భోగి, సంక్రాంతి, కనుమ పండగల పేరు చెబితే ఏడాది పొడవునా ఉత్సాహం నెలకొంటోంది. సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించే ఈ పండగ వస్తుందంటేనే ఎంతో ఆనందంగా ఉంటుంది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఆనందించే పండగ సంక్రాంతి. కొత్త అల్లుళ్లు, బంధువులు, కుటుంబ సభ్యుల రాకతో ఇల్లంతా సందడి నెలకొంటుంది. – వలవల శ్రీనివాసరావు, మంగళవారపుపేట, రాజమహేంద్రవరం

సంప్రదాయబద్ధంగా పండగ చేసుకోవాలి


ఆటోలో ప్రచారం నిర్వహిస్తున్న కానిస్టేబుల్

కడియం: మండలంలోని ప్రజలందరూ సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండగ చేసుకోవాలని కడియం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుతో పాటు, ఎస్సైలు నాగదుర్గా ప్రసాద్, ధనలక్ష్మి ప్రసన్న మండలంలోని వేమగిరి, దుళ్ల, వీరవరం, చైతన్యనగర్, జేగురుపాడు, కడియం, కడియపులంక గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. పండగ వేళ కోడిపందాలు, పేకాట, గుండాట, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, అటువంటి కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండగ సందర్భంగా ఊళ్లకు వెళ్లేవారు ముందస్తుగా పోలీసులకు సమాచారమిచ్చి, ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను వినియోగించుకోవాలని గ్రామాల్లో ఆటోల ద్వారా ప్రచారం చేయించినట్టు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నవయుగ ధన్వంతరి డాక్టర్ యల్లాప్రగడ


వైద్యులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ మానవాళి ఆరోగ్యానికి ఆజన్మాంతం కృషి చేసిన నవయుగ ధన్వంతరి డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు అని పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు కొనియాడారు. డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతి హుకుంపేటలో రాజమహేంద్రవరం కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సంఘ మండల అధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి వీబీటీ రాజు మాట్లాడుతూ, 1895 జనవరి12న జన్మించిన యల్లాప్రగడ తన జీవితమంతా దివ్యౌషధ అన్వేషణకు వెచ్చించారన్నారు. ఈయన కనుగొన్న టెట్రాసైక్లిన్, ఆరోమైసిన్, ఫోలిక్ యాసిడ్, హెట్రాజన్, మెథాట్రెక్సేట్ వంటి ఔషధాలతో వైద్య రంగానికి మార్గదర్శకులయ్యారని కొనియాడారు. విశిష్టఅతిథి రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ విశ్రాంత ఆరోగ్యాధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి మాట్లాడుతూ, నేటి వైద్యులు డాక్టర్ యల్లాప్రగడను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. పల్స్ హాస్పిటల్ హృద్రోగ నిపుణులు కోసూరు వంశీ కృష్ణరాజు, కల్లూరు లక్ష్మణ్ గుండె వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్, ఎస్‌కే సుభాన్, ఆనందం సుబ్బారావు, ఎం జయరామ్, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, ఎ.సురేష్‌బాబు పాల్గొన్నారు.

అందరికీ మంచి రోజులు రావాలి

- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్
- వైఎస్సార్ సీపీ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరికీ మంచి రోజులు రావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా డిసెంబర్ 21న ప్రారంభమైన వైఎస్సార్ సీపీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో పలు టీమ్‌లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్ స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో జరిగింది. టోర్నీ విన్నర్‌గా నిలిచిన కాతేరు మురళీ జట్టుకు రూ.50 వేల బహుమతిగా చెక్కు, కప్‌ను అందజేశారు. ద్వితీయ బహుమతి గెలుచుకున్న వీఎల్ పురం ఎస్ఎస్ బంగార్రాజు ఎలెవన్ జట్టుకు రూ.25 వేలు, కప్పును అందించారు. తృతీయ బహుమతి హుకుంపేట ఎస్ఎస్ ఎలెవెన్ జట్టుకు కప్పుతో పాటు, రూ.15 వేలను అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా సెంచరీ చేసిన నాగశివకు నగదు బహుమతితో పాటు, కప్‌ను బహూకరించారు. ప్రియదర్శిని మూగ, చెవిటి ఆశ్రమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని కోరుకుంటూ, టోర్నీకి వచ్చిన ఎంట్రీ ఫీజు మొత్తాన్ని విరాళంగా ఇస్తున్నట్లు భరత్‌రామ్ ప్రకటించారు. ఆశ్రమ నిర్వాహకురాలు స్వప్న జోసఫ్‌కు రూ.36 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర బీసీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ప్రియదర్శిని ఆశ్రమ నిర్వాహకులకు చెక్కును అందజేస్తున్న భరత్‌రామ్

పలుకులో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సంక్రాంతి సందర్భంగా స్థానిక స్వరాజ్యనగర్‌లోని 'పలుకు' బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఈ సంబరాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం సంస్కృతీసంప్రదాయాలు మరుగున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుకు ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు విద్యతో పాటు, సంస్కృతీసంప్రదాయాలపై మంచి అలవాట్లు నేర్పుతూ, వారి మంచి చెడ్డలు చూస్తున్న నిర్వాహకులకు అభినందించారు. విద్యార్థుల కోసం హాస్టల్ గదిని ఏర్పాటు చేసిన జవహర్ వాకర్స్ క్లబ్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎమ్మెల్యే దుప్పట్లు, టవళ్లు, వాటర్ బాటిళ్లను అందించారు. చిన్నారుల రంగవల్లులు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దులు, కోడిపందాలు తదితర సంప్రదాయ కళలతో పండగ వాతావరణం సంతరించుకుంది.

రాజాయోనాకు సోషల్ ఇంపాక్ట్ జాతీయ పురస్కారం


రాజయోనాకు పురస్కారాన్ని అందజేస్తున్న ప్రొఫెసర్ మధుక్రిషన్

రాజమహేంద్రవరం రూరల్: తెలుగు భాషా, సంస్కృతీ సంప్రదాయాల కోసం ఫిలాంత్రఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష కృషి చేస్తున్నందుకు బొమ్మూరుకు చెందిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజాయోనాకు ప్రతిష్టాత్మక సోషల్ ఇంపాక్ట్ జాతీయ పురస్కారం లభించింది. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కన్నడ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైసూరులోని కర్ణాటక టుంకూరు యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. అమెరికన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ మధు క్రిషన్ ఆయనకు ఈ పురస్కారాన్ని అందించారు. సంస్థ ద్వారా 2016 నుంచి విభిన్న రంగాల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించి, అనేక కార్యక్రమాలను రాజయోనా నిర్వహించారు. వివిధ యూనివర్సిటీలు, ఏపీ సాహిత్య అకాడమీ, ఏపీ కల్చరల్ కమిషన్, బయోడైవర్సిటీ బోర్డ్ భాగస్వామ్యంతో మలేషియా, దుబాయ్, థాయ్‌లాండ్ దేశాల్లో ప్రవాస భారతీయ సంఘాల సౌజన్యంతో చేసిన కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారని రాజయోనా తెలిపారు. చారిత్రాత్మక మైసూరు నగరంలో ఈ విశిష్ట పురస్కారం అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని రాజయోనా తెలిపారు.

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన వివేకానంద


వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్వామీజీలు

సీటీఆర్ఐ: సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి స్వామి వివేకానంద అని పలువురు ప్రముఖులు కొనియాడారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో కంబాల చెరువు వివేకానంద సర్కిల్ వరకు విద్యార్థులు శోభాయాత్ర నిర్వహించారు. భారత సనాతన ధర్మాన్ని, దేశ ఔన్నత్యాన్ని, ధర్మ విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద అని ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివేకానంద జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభకు తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న భారత్ వికాస్ పరిషత్ సభ్యులు


వివేకానందుని చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

బుద్ధవిహార్‌లో వేడుకలు

కడియం: వేమగిరిలోని బుద్ధవిహార్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి ప్రముఖులు ఆకుల రామకృష్ణ, కొత్తూరి బాలనాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే యల్లాప్రగడ సుబ్బారావు జయంతి వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు అడబాల శ్రీనివాసరావు, బొట్టా సుబ్బారావు, నల్లయ్య, సత్యనారాయణ, ఇంజినీర్ వినోద్, కత్తుల రాజా తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిదాయకం

వివేకానంద ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. వేమగిరి బుద్ధ విహార్‌లో ఆదివారం మహోదయ యాజరా ఆధ్వర్యంలో వివేకానంద జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.

ఆర్ట్స్ కళాశాలలో నేషనల్ యూత్ డే

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, వైఆర్‌సీ సంయుక్తాధ్వర్యంలో నేషనల్ యూత్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే అధ్యక్షత వహించారు. విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, నిస్వార్థ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని ఉద్బోధించారు. ముఖ్యఅతిథి, రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి సేవ్యనంద్ మాట్లాడుతూ, విద్యార్థులు ఏకాగ్రతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్లు డాక్టర్ బి.మల్లికార్జున, డాక్టర్ యుసుఫ్ బాషా, డాక్టర్ అనూష, ఎన్ఎస్ఎస్ పీఓలు బి.భవాని, బి.మురళీకృష్ణ, కె.సుభాషిణి దేవి, హెచ్.పవన్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద

రాజమహేంద్రవరం సిటీ: మహోన్నత వ్యక్తిత్వం కలిగిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మానవ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దేవత సుధాకర్, కింతాడ రమేష్‌బాబు, తంగేటి దుర్గాప్రసాద్, గుదే వెంకటేశ్వరరావు, కేఎల్ఎన్ రెడ్డి, వైకేఎల్, అనిల్ కుమార్, బెవర సత్యనారాయణ, బి.బాలాజీ పాల్గొన్నారు.

ఆయన అడుగు జాడల్లో నడవాలి

రాజమహేంద్రవరం రూరల్: యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలని దూబచర్ల డైట్ కళాశాల అధ్యాపకుడు నూజిళ్ల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం పిడింగొయ్యి వెంకటగిరిలో రిమ్మపూడి సుబ్బరాజు ఇంటి వద్ద రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సంక్రాంతి–వివేకానంద జయంతి ఉత్సవం అడపా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ముఖ్య వక్త నూజిళ్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, మన సంప్రదాయాలను రానున్న తరాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంఘచాలక్ రిమ్మలపూడి సుబ్బరాజు, గారపాటి శ్రీఅమరనాథ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బొమ్మూరులోని శ్రీవివే కానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం జరిగింది. భారత్ వికాస్ పరిషత్ టంగుటూరి ప్రకాశం శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేంద్రంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.


ఆర్ట్స్ కళాశాలలో వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు


వివేకానందుని చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు


స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు